## బీఆర్ఎస్ విజేతలకు మాజీ శాసనసభ్యుడు ఆల అభినందనలు

**మర్యాదపూర్వకంగా కలిసిన పురపాలక ఎన్నికల అభ్యర్థులు**

**భవిష్యత్తులో మరింత రాణించాలని దిశానిర్దేశం**



**ప్రజానావ, దేవరకద్ర:**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర పురపాలక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు శుక్రవారం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు ఆల వెంకటేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మాజీ శాసనసభ్యుడిని కలిసిన వారిలో గెలుపొందిన దేవరకద్ర పురపాలక సంఘం అభ్యర్థులు యుగేందర్ రెడ్డి, కొండల్ తో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో చూపించిన స్ఫూర్తితోనే ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుకు సాగాలని ఆయన విజేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ భవిష్యత్తులో రాజకీయంగా మరింత రాణించాలని సూచించారు.

## కొండా ప్రశాంత్ రెడ్డి అనుచరుడి విజయకేతనం

**దేవరకద్రలో బీజేపీ తొలి కౌన్సిలర్ గా ఉమారాజు**

**అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ప్రకటన**



**ప్రజానావ, దేవరకద్ర, :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర పురపాలక సంఘం తొలి బీజేపీ కౌన్సిలర్ గా స్థానికుడు ఉమారాజు విజయం సాధించారు. బీజేపీ నియోజకవర్గ బాధ్యుడు కొండా ప్రశాంత్ రెడ్డి అనుచరుడిగా మంచి పేరుప్రతిష్ఠలు ఉన్న ఆయన తాజా ఎన్నికల్లో సత్తా చాటారు. ప్రశాంత్ రెడ్డి సూచనలు, సలహాలతో ఆయన ఈ విజయదుందుభి మోగించారు. నాలుగో వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలుపొందిన ఉమారాజు మాట్లాడుతూ.. తన విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇకమీదట స్థానిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన నియోజకవర్గ బాధ్యుడు కొండా ప్రశాంత్ రెడ్డి, పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ, జిల్లా, రాష్ట్ర పార్టీ ముఖ్య నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## మెదక్ పురపాలక పీఠం ఎవరికి?

**కీలకమైన బీజేపీ కౌన్సిలర్లు**

**15-15 స్థానాలతో టీఆర్ఎస్, కాంగ్రెస్ సమానం**

**ఆ ఇద్దరి మద్దతు ఎవరికి దక్కితే వారికే అధ్యక్ష పదవి**




**ప్రజానావ, మెదక్ :**
మెదక్ పురపాలక సంఘం ఎన్నికల ఫలితాల్లో ఎవరికీ స్పష్టమైన ఆధిక్యం రాకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ప్రధాన పార్టీలైన టీఆర్ఎస్, కాంగ్రెస్ సమాన స్థానాలు సాధించడంతో పురపాలక అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ తరుణంలో ఇద్దరు బీజేపీ కౌన్సిలర్ల మద్దతు అత్యంత కీలకంగా మారింది.

### అధికార పీఠం కోసం నువ్వా నేనా

ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ 15 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 14 స్థానాలను దక్కించుకుంది. అయితే బీఎస్పీ నుంచి గెలుపొందిన ఏకైక అభ్యర్థి కాంగ్రెస్ కు తన మద్దతు ప్రకటించారు. దీంతో రెండు పార్టీల బలం 15-15 తో సమానమైంది. పురపాలక సంఘంపై జెండా ఎగురవేయాలంటే మెజార్టీ తప్పనిసరి కావడంతో రెండు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొంది.

### కమలం చేతిలో తాళంచెవి


ఈ తాజా పరిణామాలతో అందరి దృష్టి బీజేపీ అభ్యర్థులపై పడింది. ఈ ఎన్నికల్లో 21వ వార్డు నుంచి పబ్బ రాజమణి, 28వ వార్డు నుంచి ఇప్ప అఖిల భరత్ బీజేపీ తరఫున కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఇప్పుడు ఈ ఇద్దరి మద్దతు ఎవరికి దక్కితే వారే అధ్యక్ష పీఠం అధిష్టించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఇద్దరు కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు అటు టీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పీఠం దక్కించుకునేందుకు ఈ ఇద్దరి మద్దతే సులువైన మార్గం కావడంతో మెదక్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

# మున్సిపల్ ఫలితాల ఎఫెక్ట్

**కాంగ్రెస్‌లోకి 'వలసల' జోరు!**

**బీఆర్ఎస్ కౌన్సిలర్, ఇద్దరు ఇండిపెండెంట్లు 'హస్తం' గూటికి..**

**కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే వేములవాడలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ కౌన్సిలర్ నరాల శేఖర్, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన కుమ్మరి శిరీష-శ్రీనివాస్, ఎల (టైలర్) శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజల మార్పు ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. స్థానిక సంస్థల బలోపేతంతో పట్టణాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో కొత్తగా చేరిన ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఇతర పార్టీలను వీడి కాంగ్రెస్‌లో చేరడం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి చేరికలు కొనసాగనున్నట్లు పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి.

# మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

**1200 మంది పోలీసులతో బందోబస్తు**

**భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం**

**ప్రజానావ, వేములవాడ:** భీమేశ్వర ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే మహా శివరాత్రి మహాజాతర సందర్భంగా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్టు సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బి.గీతే తెలిపారు. జాతరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం వేములవాడ పట్టణంలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం కల్పించేందుకు 1200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దేవస్థానం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది భక్తులు క్యూలైన్ పాటించేలా చూడాలని, ఎవరికి ఇబ్బందులు కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఓపికతో భక్తులకు సలహాలు, సూచనలు ఇస్తూ మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని, సమన్వయంతో జాతర విజయవంతం చేయాలని సూచించారు. భక్తజన సందోహం ఉన్నచోట దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరగకుండా క్రైమ్ పార్టీలు నిరంతరం పహారా కాస్తాయని పేర్కొన్నారు. మహిళల రక్షణార్థం షీ టీమ్ బృందాలు సివిల్ డ్రెస్‌లో విధులు నిర్వహిస్తాయని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా భారీగా వాహనాలు వచ్చే అవకాశమున్నందున పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాహనాలు క్రమబద్ధంగా పార్క్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రత్యేక రూట్ మ్యాప్‌లు అమలు చేస్తున్నామని చెప్పారు. రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, కోన్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**ప్రజానావ, కరీంనగర్:** కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం ప్రకారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఇఏ) ఎల్ఐసిలో అతిపెద్ద కార్మిక సంఘం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్ఐసి కరీంనగర్ డివిజన్లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ( ఐసిఇయు) ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. కరీంనగర్ డివిజనల్ ఆఫీస్ ప్రాంగణంలో నిర్వహించిన సభలో ఐసిఈయు అధ్యక్షులు ఏ రామ్మోహన్ రావు మాట్లాడుతూ అత్యంత క్రూరమైన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికులకు అంతంత మాత్రంగా ఉన్న హక్కులను హరించే విధంగా ప్రభుత్వం తీసుకు వచ్చిందని దుయ్యబట్టారు. భారతదేశంలో కార్మిక సంఘా లను కార్మికులను పూర్తిగా అణగదొక్కే లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రైవేటు కార్పొరేట్ వర్గాలకు ఇన్సూరెన్స్ రంగాన్ని అప్పుజెప్పడమేనని వివరిం చారు. భీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించడం, భారతదేశ ప్రజల పొదుపును విదేశాలకు తరలించుకుపోయేందుకు కార్పొరేట్లకు ప్రభుత్వం ఇచ్చిన ఆహ్వానంగా పేర్కొన్నారు. ఈ సభలో ఐసీఈయు కరీంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి రామన్ రావు మాట్లాడుతూ భారతదేశ ప్రభుత్వ రంగాలను కాపాడుకోవడానికి, కార్మికులకు కనీస 9000 పెన్షన్ కల్పించాలన్నారు. ఎల్ఐసిలో ఏఐఐఈఏ చేస్తున్న సమ్మెకు ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ తమ పూర్తి మద్దతును సహకారాన్ని తెలియజేస్తుందని కరీంనగర్ డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతం సభలో సంఘీభావాన్ని తెలియజేశారు. ఐసీఈయూ కరీంనగర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు డి సూర్యకళ సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ సి అనుపమ, కోశాధికారి కామ్రేడ్ ఎం. శ్రీలత, కరీంనగర్ బ్రాంచ్ 1, బ్రాంచ్ 2, డివిజనల్ ఆఫీస్ ఐసీఈయూ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ పట్టణంలో గీతా భవన్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అన్ని కార్మిక సంఘాల సమ్మె ర్యాలీలో ఐసిఈయు సభ్యులు పాల్గొన్నారు.






## ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

**ప్రజానావ, ఆదిలాబాద్:** సరోజినీ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని తలమడుగు మండలం సుంకిడి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుజాత నేతృత్వంలో ఆంగ్లభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆంగ్ల నాటిక, ఏకపాత్రాభినయం, పాటలు, ఉపన్యాసాలు, క్విజ్ పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిజిహెచ్ఎం జైవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంగ్ల దినోత్సవ విజయానికి విశేషంగా కృషి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుజాతశ్రీఅ పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గజానన్, సుకుమార్ పేట్కులే, పీడీ నాందేవ్, తెలుగు ఉపాధ్యాయురాలు వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజానావ, జైనూర్, సిర్పూర్(యు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టపాతంగా అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకాన్ని జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ అఖిల్ అహ్మద్ ఒక ప్రకటన తెలిపారు. 200 యూనిట్ లోపల వచ్చే ప్రతి వినియోగాదారులు ఆన్ లైన్ చేసుకోవాలని సూచించారు. సిర్పూర్(యు), లింగాపూర్, మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. గతంలో ప్రజా పాలన ద్వారా అందించిన దరఖాస్తు రశీదు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు రశీదులతో జూనియర్ లైన్‌మెన్ శ్రావణ కుమార్ ను సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజానావ, జైనూర్:** ఉట్నూర్ నుంచి జైనూర్ వరకు ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌పై మరమ్మత్తు పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏడీఏ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ



**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొన్న సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి ప్రక్రియను సాఫీగా పూర్తి చేశారని అభినందించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో కౌంటింగ్ విజయవంతమైందని పేర్కొన్నారు. మద్దతు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కౌంటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది, భద్రతా సిబ్బంది, సంబంధిత అధికారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## గాయత్రి కళాశాలలో ముమ్మరంగా నైపుణ్య శిక్షణ



**ప్రజానావ, పెద్దపల్లి:** పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా తరగతులు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మృదు నైపుణ్యాల శిక్షకురాలు భవాని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, వృత్తిపరమైన విలువలు, ముఖాముఖికి సన్నద్ధమయ్యే విధానాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగ సమాచార వేదికలు, సామాజిక మాధ్యమాల ద్వారా అవకాశాలను గుర్తించి దరఖాస్తు చేసుకునే పద్ధతులను ఆమె వివరించారు. వృత్తిపరమైన విలువలలో భాగంగా ఉన్నతమైన ప్రవర్తన, సరైన శారీరక హావభావాలు, మర్యాదపూర్వక సంభాషణలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు బోధించారు. ఇందులో భాగంగా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ముఖాముఖిని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడం, వ్యక్తిగత వివరాల పత్రం తయారీ, విద్యుత్ లేఖ పంపే విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల తరగతులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు జే. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# సిరిసిల్లలో బీఆర్ఎస్ హవా

- ఇద్దరు స్వతంత్రుల మద్దతుతో వేములవాడ కాంగ్రెస్ కైవసం
- బీఆర్ఎస్ నుండి ఒకరు కాంగ్రెస్ చేరిక
- అప్రమత్తంగా 'ఆది' వ్యూహం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండు మున్సిపాలిటీలలో ఒకటి బీఆర్ఎస్, మరొకటి కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సిరిసిల్లలో కారు జోరందుకుంది. వార్ వన్ సైడ్ అనే రీతిలో ఫలితాలు వచ్చాయి. మొత్తం 39 వార్డులకు 27 వార్డుల్లో బీఆర్ఎస్ పాగా వేసి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి పరుగులు పెట్టింది. కేటీఆర్‌కు రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్లలో బీఆర్ఎస్ పట్టు నిలుపుకుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 6 వార్డులకు మాత్రమే పరిమితం కాగా.. బీజేపీ 5, ఇతరులు ఒక స్థానంలో గెలుపొందారు. అధికార కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్ కే పరిమితం కావడంతో పార్టీ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నారు.

**స్వతంత్రుల మద్దతుతో..**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రసవత్తరంగా వెలుబడ్డాయి. 28 వార్డులకు గాను 13 వార్డుల అధికార కాంగ్రెస్ దక్కించుకోగా.. బీజేపీ 8, బీఆర్ఎస్ 5 వార్డులను గెలుపొందారు. ఇద్దరు స్వతంత్రులు గెలుపొందగా వేములవాడ మున్సిపల్ పీఠానికి వీరే కీలకంగా మారారు. పట్టణంలోని 7వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఆలె (టైలర్) శ్రీనివాస్, 19 వార్డు స్వతంత్ర అభ్యర్థి కుమ్మరి శిరీష శ్రీనివాస్‌లు కింగ్ మేకర్స్ అయ్యారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన మార్జిన్ ఫిగర్ రాకపోవడంతో ఇద్దరు ఇండిపెండెంట్‌లు మద్దతుతో మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయనున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యూహాత్మకంగా వ్యవహరించి ఈ ఇద్దరిలో పాటు 21వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి



నరాల శేఖర్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చారు. దీంతో కాంగ్రెస్‌కు వేములవాడ మున్సిపల్ పీఠం దక్కినట్లయింది. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన నరాల శేఖర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించేలా ఒప్పందం కుదిరినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ప్రస్తుతం వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ రేసులో పుల్కం రాజు, తూం మధుల పేర్లు పరిశీలనలో ఉండడంతో వేములవాడ ఛైర్మన్ ఎవరనేది హాట్ టాపిక్‌గా మారింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల పదవుల కేటాయింపులో సామాజిక వర్గాల సమీకరణాలు పెద్ద సమస్యగా మారింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఒకే సామాజిక వర్గానికి ఇవ్వనున్నట్లు ప్రచారం జరగడంతో కాంగ్రెస్‌లో తర్జనభర్జన కొనసాగుతుంది.






## నైపుణ్యతను వెలికి తీసేందుకు సీఎం కప్

### జిల్లా యువజన క్రీడా సేవల అధికారి

**ప్రజానావ, మంచిర్యాల:** గ్రామీణ స్థాయి నుంచి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి అన్నారు. హాజిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం 2వ రోజు జరిగిన క్రీడా పోటీలకు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, జిల్లా ఎస్జిఎఫ్ కార్యదర్శి ఎండీ యాఖుబ్, క్రీడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

**ప్రజానావ, కౌటాల:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో శుక్రవారం వెలువడిన ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లను కైవసం చేసుకుంది. దీంతో మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ పార్టీకు మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని కౌటాల సర్పంచ్ నక్క శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి జాతర ప్రారంభం

**ప్రజానావ, కౌటాల:** మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులో వార్ధా నది ఒడ్డున ఉన్న కుర్తా శ్రీ శివ సిద్ధి హనుమాన్ మందిర్‌లో మహా శివరాత్రి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ జాతర ఉత్సవాలు ఈనెల 17వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర మహోత్సవాలను గ్రామ సర్పంచ్ బడగే సంతోష్ ప్రారంభించగా, ఉప సర్పంచ్ డోంగ్రే కేశవ్ రావు, హిందూ వాహిని జిల్లా సహ ప్రముఖ్ ఎల్ములే దత్తు పటేల్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివయ్యకు ప్రత్యేక అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావుత్ రాందాస్, హన్మంతు, గోండే నితీష్, వార్డ్ సభ్యులు అరవింద్, రాజేందర్, ఇప్ప సుధాకర్, ఆలయ పూజారి, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

**ప్రజానావ, జైనూర్:** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని వెడమ జైవంత్ మహరాజ్ అన్నారు. సిర్పూర్ (యూ) మండలం పంగిడి గ్రామంలోని శ్రీ పులాజీ బాబా ధ్యాన కేంద్రం 24వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదట జెండా పూజ నిర్వహించి శ్రీ పులాజీ బాబా చిత్రపటానికి పూజలు చేశారు. బాబా తనయుడు కేశవ్ రావు ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి ధ్యానారాధనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్ రావు జైవంత్ మహరాజ్ మాట్లాడుతూ బాబా చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకుంటూ అనేక కుటుంబాలు సన్మార్గంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకోవాలని, భవిష్యత్ తరాలకు కూడా బాబా బోధనలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు టార్పె రఘునాథ్ విశ్వంబర్, ఆత్రం భాగవంత్ రావు, బొడికే శ్యాంరావు, బొథింగ్ శ్యాంరావు, జనార్దన్, గంగాధర్ దేశముఖే, మారుతి దుక్రే, సుభాష్, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**ప్రజానావ, జైనూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు నాబార్డ్, సహకార బ్యాంకుల సౌజన్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాబార్డ్ ఎఫ్ఎల్సీ లోక రామ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని జండగూడ పంచాయతీ పరిధిలోని అల్లిగూడ గ్రామంలో సర్పంచ్ ఉయిక చందన్ షావ్ అధ్యక్షతన ఆర్బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ డీడీఎం వీరభద్రుడుతో కలిసి మాట్లాడారు. రైతులు కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, భద్రతా పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే రైతులు నష్టపోకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జండగూడ సర్పంచ్ ఉయిక చందన్ షావ్, గ్రామ పటేల్ ఉయిక చిత్రు, జైనూర్ సహకార బ్యాంకు మేనేజర్ టి రాజేశ్వర్, సహకార కార్యదర్శి రాథోడ్ ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

## రెగ్యులర్‌గా పౌష్టికహారం తీసుకోవాలి



**ప్రజానావ, నేరడిగొండ:** గర్భిణీలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని లఖంపూర్ గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ అన్నారు. శుక్రవారం లఖంపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు శాతం, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికహారంపై ఆరా తీశారు. ఈ సందర్బంగా గర్భిణీలకు కోడిగుడ్లు ఆందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల హాజరు శాతం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు .

## అంగన్వాడీలో బాలామృతం పంపిణీ



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ సెక్టార్ పరిధిలోని మహాలక్ష్మివాడ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం గర్భిణీలకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, పంచాయతీ కార్యదర్శి దొంద దివాకర్, వార్డు సభ్యులు దుర్గ చరణ్, విష్ణు కళ్యాణ్, ఎండీ జుబైర్, పుల్గం శ్రీకాంత్, శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు అరుణ్, ప్రసాద్ గౌడ్, కొరల శంకర్, బానుప్రసాద్, నవీన్ గౌడ్, ప్రశాంత్, కంపెల శ్రీనివాస్, ఆధాం ఖాన్, మగ్ధూం,సజ్జు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తాండూర్ విద్యుత్ శాఖ ఏఈ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ సబ్ స్టేషన్ పరిధిలోని బోయపల్లి, చౌటపల్లి, తాండూర్, ఐబీ రాజీవ్ నగర్, మాదారం, మాదారం3 ఇంక్లైన్, కాసిపేట, ద్వారకాపూర్, నర్సాపూర్ గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# చికిత్సతో క్షయ వ్యాధిని అరికట్టవచ్చు



**ప్రజానావ, తాండూర్:** ప్రారంభ దశలోనే క్షయ వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి ప్రసన్న అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని కాసిపేట గ్రామంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె క్షయ వ్యాధి నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని అన్నారు. అవగాహనలో భాగంగా సిబ్బంది క్షయ వ్యాధి నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచిత చికిత్సతో పాటు చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.వెయ్యి చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్నిరకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి పరీక్షలు చేశారు. అలాగే తెమడ పరీక్ష కోసం 17 మందికి, ఎక్స్ రే అవసరం ఉన్నవారికి 76 మందికి ఇంటికి దగ్గరలోకి పొర్టబుల్ ఎక్స్ రే యంత్రం ద్వారా ఎక్స్ రే తీశారు. ఈ శిబిరంలో కాసిపేట గ్రామ సర్పంచ్ ముదం వనజ గోవర్ధన్, ఉప సర్పంచ్ బోయిని సుమలత, వార్డు మెంబర్స్ సుంకరి గోపి, సిద్ధం గోపాల్, కంబాళ్ళ తిరుపతి, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రసన్న కుమారి, డివిజన్ క్షయవ్యాధి సూపర్ వైజర్ శ్రీపెల్లి శశికాంత్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ మేరీ, హెల్త్ సూపర్ వైజర్ రమాదేవి, తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం తులసి, ల్యాబ్ టెక్నీషియన్ హాకీశీ, ఎక్రే టెక్నీషియన్ ప్రవీణ్, ఆశ కార్యకర్తలు లక్ష్మి, స్రవంతి, విజయ, సంధ్యా రాణి, మల్లేశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి గ్రామైక్య భవనానికి భూమి పూజ



**ప్రజానావ, జైనూర్:** సిర్పూర్(యు) మండలంలోని బాండేర్ గ్రామపంచాయతీ కేంద్రంలో ముంజిగూడ లక్ష్మి గ్రామైక్య సంఘానికి ఉపాధిహామీ పథకం ద్వారా భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా బాండేర్ పంచాయతీ సర్పంచ్ కుమ్ర భీంరావు శుక్రవారం భూమి పూజ చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణంతో సంఘాల మహిళలకు సమావేశాలు నిర్వహిం చడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కా ర్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం భీంరావ్, జైనూర్ ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, ఐకేపీసీసీ జైవంతరావు, విఓఏ సలాం తుకారాం, బీఎల్ఓ భీంరావు, కారోబార్ తొడసం గంగారాం, గ్రామైక్య సంఘ నాయకురాలు బిజిలా బాయి, వర్క్ ఇన్ స్పెక్టర్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాయకునికి వీరన్నగూడెం పట్టం

- గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు వార్డు అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం
- గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటాం
- 10వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్






**ప్రజానావ, గుమ్మడిదల:** గుమ్మడిదల మున్సిపాలిటీలో ని వీరన్న గూడెం.10వ.వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి షేక్ గౌసియా హుస్సేన్ 358 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను అతని సమస్యలుగా భావించి ఎంతోమంది యువతకు ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలిచిన షేక్ గౌసియా హుస్సేన్ ను తమ ఓటు అనే ఆయుధంతో ఆశీర్వదించి ప్రజ నాయకునికి పట్టం కట్టారని వీరన్న గూడెం ప్రజలు యువకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా 10వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలు ప్రజలకు అందిస్తానని కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ సమాజ సేవ కోసం ముందుంటానని అన్నారు.వీరన్న గూడెం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం అడుగుజాడల్లో నడుస్తూ గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు10వ.వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించిన వీరన్నగూడెం 10వ. వార్డు పెద్దలు మహిళలు విద్యార్థులు యువకులు తోటి స్నేహితులు బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు గెలుపుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా భాగస్వామ్యంతోనే అడవుల సంరక్షణ

**పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ**




**ప్రజానావ, సత్తుపల్లి:** ప్రజా భాగస్వామ్యంతోనే అడవుల సంరక్షణ సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ అన్నారు. సత్తుపల్లి అటవీ రేంజ్ పరిధిలో ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ డాక్టర్ భీమా నాయక్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సత్తుపల్లి టింబర్ డిపోలో అధికారిక సమావేశాల కోసం నిర్మించిన నూతన వీఐపీ గది, అటవీ అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా చంద్రయ్యపాలెం బీట్ పరిధిలో ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను ప్రారంభించి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే చంద్రయ్యపాలెం మండల ఉన్నత ప్రాథమిక పాఠశాలను సందర్శించి అటవీ శాఖ నిధులతో చేపట్టిన రంగుల పనులను పరిశీలించి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన సంరక్షణ సమితి సభ్యుల ఆరోగ్య అవసరాల కోసం ఏర్పాటు చేసిన కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించారు. సభ్యుల ఉపాధి అవకాశాల పెంపు కోసం అందించిన లీఫ్ ప్లేట్స్ తయారీ యంత్రాలు, కాటన్ విక్స్ యూనిట్లు, తేనెటీగ పెట్టెల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ రక్షణతో పాటు స్థానికులకు ఉపాధి, విద్య, ఆరోగ్య సదుపాయాల కల్పన అటవీ శాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. భద్రాద్రి సర్కిల్ పరిధిలో అటవీ రక్షణతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించడం మా ప్రధాన లక్ష్యమని డాక్టర్ భీమా నాయక్ అన్నారు. కొత్త ఇళ్ల నిర్మాణం, పాత ఇళ్ల మరమ్మతులు, అటవీ ప్రాంత పిల్లల ఉన్నత చదువులకు సహాయం అందించడం ద్వారా అటవీ శాఖ ప్రజలకు మరింత చేరవవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి రేంజర్, అటవీ శాఖ సిబ్బంది, వన సంరక్షణ సమితి సభ్యులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

